క్లుప్తంగా

వైభవంగా చండీ హోమం


చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మ ఆలయంలో చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు సుదర్శన వేణుగోపాలచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు సత్యకిరణ్ హోమ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ మాట్లాడుతూ అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని చండీ హోమం నిర్వహించినట్లు తెలిపారు. చండీ హోమానికి ఉభయదారులుగా దారా చక్రవర్తి దంపతులు వ్యవహరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దూసనపూడి ఏడుకొండలు, పద్మావతి దంపతులు ప్రసాద వితరణ చేశారు. ఆలయ శాశ్వత కమిటీ ప్రధాన కార్యదర్శి మాడా రామమోహనరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెప్మా రిసోర్స్ పర్సన్ల సమస్యలు పరిష్కరించాలి


వినతి పత్రం అందజేస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్లు

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీలో మెప్మా రిసోర్స్ పర్సన్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారి టీఎంసీఎం రమేష్‌బాబుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. రిసోర్స్ పర్సన్లు మూడు నెలల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఉద్యోగ కాల పరిమితిని ఎత్తివేయాలని, ఆర్‌సీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇ.ఝాన్సీ, బి.కృష్ణవేణి, జస్సింత, మహాలక్ష్మి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారికి తిరువీధి సేవ


క్షేత్ర పుర వీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో శ్రీవారి తిరువీధి సేవ బుధవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. శ్రీ మణవాళ మహామునుల తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుక భక్తులకు నేత్ర పర్వమైంది. ముందుగా ఆలయంలో తొళక్క వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వేంచేపు చేశారు. తరువాత అర్చకులు పూజాదికాలను నిర్వహించి, హారతులిచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పుర వీధులకు పయనమైంది.

మైక్‌సెట్ బహూకరణ


మైక్ సెట్ అందజేస్తున్న దాత రామకృష్ణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నాల్గో వార్డ్ ఇందిరానగర్ కాలనీలో కొలువైయున్న శ్రీఅభయాంజనేయ స్వామి వారి దేవాలయానికి మైక్‌సెట్ సమకూరింది. రూ.75 వేల విలువ గల మైక్‌సెట్‌ను పట్టణానికి చెందిన వ్యాపారవేత్త, రూపా డిజిటల్స్ అధినేత ప్రగడ రామకృష్ణ, లక్ష్మీ సురేఖ దంపతులు బుధవారం అందజేసినట్టు ఆలయ నిర్మాణకర్త, వారధి ట్రస్ట్ వ్యవస్థాపకుడు వలవల తాతాజీ తెలిపారు. కార్యక్రమంలో కేఎల్ఎన్ ధనకుమార్, మద్దిపాటి శ్రీను, చిలుకూరి రాజు, వీరబాబు, రెబ్బా రంగమ్మ, బోయిన వెంకన్న, దివార్, బసవరాజు వేణు, కలపాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గాడిద పాలు.. గరిటెడైనా చాలు


గాడిదతో వీధుల్లో తిరుగుతున్న మహిళ

ద్వారకాతిరుమల: గాడిద పాలు గరిటెడైనా చాలు అంటుంది ఓ మహిళ. బుధవారం ద్వారకాతిరుమలలోని పలు వీధుల్లో తిరిగి గాడిద పాలను విక్రయించింది. ఉబ్బసం ఉన్నవారు కొంచెం ఈ గాడిద పాలను తాగితే చాలు జబ్బు మాయమవుతుందని చెప్పి, పలువురికి ఈ పాలను అందించింది. సుమారు 10 మిల్లీ లీటర్ల గాడిద పాలను రూ.150 లకు విక్రయించింది.

మెట్ట రైతాంగం.. వరి కోతలకు సిద్ధం


మెట్ట ప్రాంతంలో వరికోత యంత్రాలతో కోతలు కోయిస్తున్న దృశ్యం

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ నెలలో తుఫానులు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారుల ప్రకటనలు చూసి మెట్ట రైతులు కోతలకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో వరి కోతలకు సమాయత్తమయ్యారు. వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం సబ్ డివిజన్ పరిధిలో 24,608 ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో చింతలపూడి మండలంలో అత్యధికంగా 13,174 ఎకరాలు, లింగపాలెం మండలంలో 6,473 ఎకరాలు, కామవరపుకోట మండలంలో 2,829.1 ఎకరాలు, టి.నరసాపురం మండలంలో 2,132 ఎకరాలు సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం మెట్ట ప్రాంతంలో వరి పంట కోతకు వచ్చి సిద్ధంగా ఉంది. సబ్ డివిజన్ పరిధిలో 28,608 ఎకరాల్లో 70,208 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 55,968 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అంచనా వేశారు. కొన్ని గ్రామాల్లో కూలీల కొరత ఉండటంతో వరికోత యంత్రాలపై రైతులు ఆధార పడుతున్నారు. వరి కోత మిషన్ అయితే గంటకు రూ.2,000 నుంచి రూ.3,000 వరకు చెల్లించి కోతలు కోయిస్తున్నారు. కూలీలతో అయితే కోతలు కోసి ధాన్యం ఆరాక కుప్పలు వేసి నూర్పిళ్లు చేపట్టేవారు. యంత్రాలతో అయితే ఒకేసారి కోతతో పాటు ధాన్యం నూర్పడం కూడా పూర్తవుతుండటంతో యంత్రాల కోసం రైతులు ఎగబడుతున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న వరికోత యంత్రాల యజమానులు ఎక్కువ డిమాండ్ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

> ### ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించండి
>
> 
>
> రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించండి. సబ్ డివిజన్‌లో 78 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాటు చేస్తున్నాం. రైతులు దళారులను నమ్మి నష్టపోకుండా రైతులకు మద్దతు ధర చెల్లించి అన్ని రకాలుగా సహకారం అందిస్తున్నాం. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుని నిబంధనల ప్రకారం తేమ శాతం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
>
> – బి.నాగకుమార్, వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్

కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి

వీవోఏల ఆందోళన


జంగారెడ్డిగూడెం: ఏపీఎంకు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు


వేలేరుపాడు: వెలుగు సీసీ కొండలరావుకు వినతిపత్రం అందజేస్తున్న వెలుగు వీవోఏలు


చింతలపూడి: ధర్నా చేస్తున్న వీవోఏలు

జంగారెడ్డిగూడెం: కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని వెలుగు వీవోఏలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయం వద్ద వీవోఏలు ఆందోళన నిర్వహించి, ఏపీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు వై.జగదాంబ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని ప్రధాన డిమాండ్ నిరసన కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయు టౌన్ కార్యదర్శి షేక్ సుభాషిణి, వీవోఏల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆదిలక్ష్మి, రాజమణి, వరలక్ష్మి, కృష్ణవేణి, మేరీ రోజా తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు: మండలంలో వీవోఏల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వెలుగు కార్యాలయ సీసీ కొండలరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఎం.దుర్గారావు మాట్లాడుతూ వీవోఏలపై జరుగుతున్న వేధింపులు, తొలగింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత, 5 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.వెంకటేశ్వరరావు, ఎస్కే పర్వీన్, జి.సౌందర్య, బి.మాధవి, వై.ఉషా, జి.రమేష్, కె.లక్ష్మణరావు, ఎ.సుమ, ఎం.శ్రీను ఎస్.దుర్గారావు, ఎ.వెంకటేష్, కె.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి: వెలుగు వీవోల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు వీవోఏలు బుధవారం ఆందోళన నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి వెలుగు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ సత్యనారాయణ మాట్లాడుతూ అధికార పార్టీ వీవోఏలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. సరైన జీతం భత్యం లేకుండా వెట్టిచాకిరీ చేస్తున్న వీవోఏలను తొలగించి, తమకు అనుకూలమైన వారిని నియమించుకోవడానికి కూటమి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. వీవోఏలకు బకాయి ఉన్న నాలుగు నెలల జీతాల బకాయిలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి, వేధింపులు నిలిపి వేయాలని కోరారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. యూనియన్ నాయకురాలు ఆవుని ఆశ, భానువతి, కృష్ణకుమారి, వసంత పాల్గొన్నారు.

మద్ది అంజన్నకు లక్షార్చన


మద్ది ఆంజనేయస్వామికి లక్షార్చన పూజ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం స్వామి వారికి లక్షార్చన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నిత్యార్చన, తోమాలసేవ, గోపూజ, నిత్య హోమబలిహరణలు వైఖానస ఆగమ యుక్తంగా నిర్వహించారు. స్వామి వారి నిత్యాన్నదాన సత్రం నందు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ వద్ద అగ్నిమాపక సిబ్బంది, పోలీసు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, బొర్రంపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సేవలు అందించారు. కార్తీకమాసోత్సవములలో భాగంగా గురువారం ఉదయం ఉపాలయం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించబడుతుందని ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

కూటమి హామీని అమలు చేయాలి


సమావేశమైన ఆదివాసీ సంఘాల నాయకులు

బుట్టాయగూడెం: అరకు ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన ఎన్నికల హామీని అమలు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం స్థానిక రామనర్సయ్య భవనంలో కారం భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి అధికారంలోకి వచ్చాక ఆదివాసీలకు నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్లు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ధర్ముల రమేష్, కారం రాఘవ, పోలోజు నాగేశ్వరరావు, సరియం రామ్మోహన్‌రావు, కుంజా నవీన్, కుర్సం పృధ్వీరాజు, ఈ. భూషణం, టి. బాబూరావు, కట్టం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు నైపుణ్యం పెంచుకోవాలి


గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్: ఉపాధి హామీ పథకంలో పనులు చేసే కూలీలకు పనులు ఏ విధంగా చేయాలో నైపుణ్యం పెంచుకునే విధంగా అవగాహన కల్పించి, కనీస వేతనం వచ్చే విధంగా చూడాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం గ్రామ పంచాయతీలో సర్పంచ్ పాడుం పుష్ప అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. 2025-26 సంవత్సరంలో చేపట్టే పనులకు సంబంధించి ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 84 పనులు గుర్తించామన్నారు. ప్రస్తుతం చేస్తున్న పనులపై కూడా సమావేశంలో చర్చించారు. రైతులకు అవసరమైన పనులను గుర్తించి చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి సభ్యులు కొణతాల ప్రసాద్, గుణపర్తి చిన్న, తదితరులు పాల్గొన్నారు.

జీడిమామిడి పంటలకు బీమా సదుపాయం


సమావేశంలో మాట్లాడుతున్న హార్టికల్చర్ ఆఫీసర్

బుట్టాయగూడెం: జీడిమామిడి తోటలో రైతులు తప్పనిసరిగా తమ పంటలకు బీమా చేయించుకోవాలని హార్టికల్చర్ ఆఫీసర్ మనిమాల నవీన తెలిపారు. మండలంలోని సీతప్పగూడెంలో జీడిమామిడి రైతులకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల్లో అధిక దిగుబడులపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఎకరాకు రూ.1500 కడితే విపత్తులు సంభవించిన సమయంలో ఎకరాకు రూ.30 వేలు బీమా వస్తుందని చెప్పారు. రైతుల ఎన్ని ఎకరాలకైనా బీమా చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. పూర్తి వివరాలకు రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. ప్రస్తుత వాతావరణంలో మార్పుల దృష్ట్యా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నవంబర్ 15వ తేదీలోగా రైతులు తమ జీడిమామిడి పంటలకు బీమా చేయించడానికి చివరి తేదీ అని చెప్పారు. హార్టికల్చర్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో పెరటి కోళ్ల పంపిణీ


పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ బి.గోవిందరాజులు

పోలవరం రూరల్: మండలంలోని కొండ్రుకోట పునరావాస కాలనీల్లో ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో వెంకటరామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ విస్తరణ సంచాలకుడు డాక్టర్ బి.గోవిందరాజులు ఆధ్వర్యంలో బుధవారం 80 కుటుంబాలకు మెరుగైన పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 5 కోళ్ల చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.గోవిందరాజులు మాట్లాడుతూ పోలవరం జాతీయ ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా సొంత గ్రామాలను విడిచి బయటికి వచ్చి పునరావాస కాలనీల్లో జీవిస్తున్న గిరిజన ప్రజల జీవన విధానం, అదనపు ఆదాయం మెరుగు పరచడంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం తరపున ఈ పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ దేవివరప్రసాద్ రెడ్డి, ఎం.పిలోమన్, పి.సత్యనారాయణ దొర, గంగు రామలక్ష్మి, బొత్త ముక్కయ్య, మూలెం కుమారి, జ్యోతి బాబు, ఎం.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతుడు ముమ్మడి రామకృష్ణ

ద్వారకాతిరుమల: గడ్డికి కొట్టే మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఒక వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదయ్యింది. ఎస్సై టి.సుధీర్ తెలిపిన కథనం ప్రకారం మండలంలోని సీహెచ్ పోతేపల్లికి చెందిన ముమ్మడి రామకృష్ణ (24) జ్యోతి అనే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఆమె బంగారపు గొలుసు తాకట్టు పెట్టి కోడి పందేలు వేశాడు. ఇదిలా ఉంటే జ్యోతి గొలుసు గురించి ఆరా తీయగా, రామకృష్ణ తనకు తెలియదని చెప్పడంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో కేసు పెడుతుందేమోనని భయపడి ఈ నెల ఒకటో తేదీన మద్దులగూడెంలోని ఎదురుగుంట చెరువు వద్ద గ్రోమాక్షిన్ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య పూజితాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సీపీఎం కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

జంగారెడ్డిగూడెం: సీపీఎం ప్రచారోద్యమ కార్యక్రమాలు, ప్రజాపోరు యాత్రలు నవంబర్ 8 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. బుధవారం జంగారెడ్డిగూడెం సీపీఎం కార్యక్రమంలో ప్రజాపోరు యాత్రల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రామకృష్ణ, టి నాగమణి, మండల కార్యదర్శి ఎం జీవరత్నంలు, మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్‌రావు, జోడే సూర్యచంద్రరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

జంగారెడ్డిగూడెం: సీపీఎం జంగారెడ్డిగూడెం మండలం 15 మహా సభలు జయప్రదం చేయాలని మండల కార్యదర్శి ఎం.జీవరత్నం పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెంలో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యకిరణ్ మాట్లాడుతూ మైసన్నగూడెం గ్రామంలో నవంబర్ 12, 13 తేదీల్లో జరుగుతున్న మండల మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. మండల కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జీవరత్నం మాట్లాడుతూ నిరంతరం సామాన్య ప్రజలు బాగోగులు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం సీపీఎం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకరరావు, శాఖ సభ్యులు పులపాకుల వీర్రాజు, పి.పోతురాజు, పి.వెంకటసుబ్బారావు, పి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రసాయనశాస్త్రంపై అవగాహన పెంచుకోవాలి



అతిథి ఉపన్యాస కార్యక్రమంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రవీంద్రబాబు

చింతలపూడి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రసాయన శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో వర్ణపట శాస్త్ర అనువర్తనాలు అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగ అధ్యాపకుడు డాక్టర్ కొత్తపల్లి రవీంద్రబాబు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మెడికల్ పరీక్షలు, పరిశ్రమల్లో వివిధ నమూనాలను వర్ణపట శాస్త్రం ద్వారా నిర్ధారణ చేసే విధానం గురించి పరిశోధనాత్మకంగా వివరించారు. అనంతరం రవీంద్రబాబును సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌జేకే నరేంద్రకుమార్, అధ్యాపకులు డాక్టర్ ఏవీఆర్, డాక్టర్ బి.లవకుశ, డి.విన్నీతేజ, ఐక్యూసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ మీర్ ఆశిమ్, వి.మదన్ మోహన్, డాక్టర్ డి.దేవానందం, బి.శ్రీనివాసరావు, డాక్టర్ అంజద్ ఆలీ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. మండలంలోని రాఘవాపురం గ్రామంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి, ఇంజమూడి వెంకటరమణను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 15 లీటర్ల నాటుసారాను స్వాధనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. అలాగే పొనుకుమాడు గ్రామంలో పాత బెల్ట్ షాపు కేసులో నిర్వాహకుడు గరిగంటి అఖిల్ కుమార్‌ను సెక్షన్ 129 బీఎన్ఎస్ఎస్ 2023 చట్టం ప్రకారం చింతలపూడి తహసీల్దార్ వారి ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

శివయ్యకు లక్ష బిల్వార్చన


లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న వేద పండితులు

ద్వారకాతిరుమల: మండలంలోని తిరుమలంపాలెంలో కొలువైన భ్రమరాంభ సమేత ఆదిమల్లేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి బుధవారం లక్ష బిల్వార్చనను వేడుకగా నిర్వహించారు. కార్తీక శుద్ధ పంచమిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ముందుగా వేద పండితులు ఆలయ ప్రదక్షిణ, భూతబలి ప్రదానం, దంపతులచే గణపతి పూజను నిర్వహించారు. అనంతరం పుణ్యాహ వాచనం, పంచగవ్యప్రాశన జరిపి, శివయ్యకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అమ్మవార్లకు కుంకుమ పూజ, తదితర కార్యక్రమాలను వేద మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో జెడ్పీ స్కూల్ విద్యార్థినుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సూర్యనారాయణ

ద్వారకాతిరుమల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల కడప జిల్లా పులివెందులలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్ టెన్నీస్ పోటీల్లో మండలంలోని తిమ్మాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. అండర్–17 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థినులు పొనుకుమాటి భవ్య, శ్రీగిరి రాధిక తృతీయ స్థానంలో గెలుపొందారు. ఈ సందర్భంగా విజేతలను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ గుడి సత్యనారాయణను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ

కొయ్యలగూడెం: పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం కన్నాపురం, దిప్పకాయలపాడు గ్రామాల్లో నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలలో కేఆర్‌పురం సహాయ వ్యవసాయ సంచాలకు పీజీ బుచ్చిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పొగాకు పంటకి బదులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించారు. వివిధ పంటల్లో పోషక యాజమాన్యం గురించి, జీవన ఎరువుల వాడకంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏ వి.దిలీప్ కుమార్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టింగులపై ఫిర్యాదు

పోలవరం రూరల్: పోలవరం ఎమ్మెల్యే ప్రతిష్టకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో అసభ్యకరంగా వ్యాఖ్యానించడంపై పోలవరం పోలీస్‌స్టేషన్‌లో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు జీవీవీ సత్యనారాయణ బుధవారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేను కించపరిచేలా సోషల్ మీడియా ప్రచారం చేసిన వారిపై విచారణ జరపాలన్నారు.